సులువుగా అప్పు.. జీవితానికి అదే ముప్పు

ఆర్థిక క్రమశిక్షణ అత్యంత కీలకమంటున్న నిపుణులు

విచ్చలవిడిగా యాప్‌ల్లో అర్హతకు తగ్గ రుణాలు.. వ్యక్తుల వద్ద అప్పులు

ఆ సమయంలో కష్టం దాటేసినా.. చివరికి ప్రాణం తీసుకునే పరిస్థితులు

అతడి పేరు నరేశ్. వనస్థలిపురం వాసి. అతడు రెండు సంస్థలకు ఎండీ. అతడు అవసరాల రిత్యా కొందరి నుంచి లక్షల రూపాయల అప్పు జేశాడు. తిరిగి సకాలంలో చెల్లించడంలో విఫలమయ్యాడు. దీంతో అప్పు ఇచ్చినవాళ్లు నరేశ్‌పై ఒత్తిడి తీసుకొచ్చారు. చివరికి ఫ్యాన్‌కు ఉరేసుకుని ప్రాణాలు తీసుకున్నాడు.

అతడి పేరు శ్రీధర్. పెళ్లై 2 ఏండ్లు అయింది. ఉద్యోగమూ ఉంది. జీతం నెలకు రూ.30వేలు. మొదటి ఏడాది భార్యను సొంతూళ్లనే ఉంచాడు. రెండో ఏడాది నగరానికి తీసుకొచ్చి ఇల్లు అద్దె తీసుకున్నాడు. కాగా నెల జీతం అతడి అదనపు అవసరాలకు సరిపడలేదు. ఎలాగూ నెలనెల జీతం వస్తుంది కదా అని కొన్ని యాప్‌లను ఆశ్రయించి అతడి అర్హతకు అనుగుణంగా లోన్ తీసుకున్నాడు. ఏ రోజుకా రోజు అవసరాలను దాటేసాడు. మళ్లీ ఏదైనా ఆర్థిక సమస్య రాగానే మరో యాప్‌ను ఆశ్రయించాడు. ఇలా ఐదారు యాప్‌ల్లో రుణం తీసుకున్నాడు. ఇప్పటి వరకు బాగానే ఉన్నా ఇప్పుడు ఆ మొత్తంపై వడ్డీ చెల్లించడానికి జీతం మీదనే ఆధారపడాలి. ఇప్పుడు అతడు చేసిన నాలుగు లక్షల రుణానికి సుమారు 15 వేలపైనే వడ్డీ చెల్లించాల్సి వచ్చింది. ఉన్న జీతంలో సగం డబ్బులు రుణానికి పోగా, ఇంటి అద్దెకు, కరెంట్ బిల్లు, పాలబిల్లు, ఇతర ఖర్చులన్నీ ఇప్పుడు భారంగా మారాయి. ఏం చేయాలో అర్థం కాక దంపతుల్లో చిచ్చు మొదలైంది. యాప్ సంస్థలు అతడిని వేధించసాగాయి. దీంతో ఒత్తిడి భరించలేక సదరు వ్యక్తి ఆత్మహత్య చేసుకుని మరణించాడు.

రంగారెడ్డి కలెక్టరేట్‌లో ఓ కానిస్టేబుల్.. ఆన్‌లైన్ గేమ్‌లు ఆడటం కోసం అప్పులు చేసిండు. తిరిగి అవి చెల్లించలేక ఆరు నెలల క్రితం ఆత్మహత్య చేసుకుని చనిపోయాడు.ఇవి మచ్చుకు కొన్ని ఉదాహరణలు మాత్రమే. ఇలా నగరంలో చాలా మంది ఆర్థికపరమైన ఆత్మహత్యలు చేసుకుని ప్రాణాలు తీసుకుంటున్నారు.

- సిటీబ్యూరో, మార్చి 7 (నమస్తే తెలంగాణ) :

సామాన్యుల నుంచి వీఐపీల వరకు.. ఆర్థిక క్రమశిక్షణ లేని జీవితాలు కూలిపోయాయి. ఉన్నప్పుడు అవలంబించాల్సిన నియమాలు చేజారాక లబోదిబోమంటే ఏం లాభమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఉన్నంతలో ఎవరికి వారే ఆర్థిక క్రమ శిక్షణ పాటించాల్సిన అవసరం ఉందని సూచిస్తున్నారు. ప్యాకేజీ ఎంతొచ్చినా పొదుపుపై అవగాహన లేకపోతే అంతేసంగతులు. అది లక్షల జీతమైనా.. అమెరికా కొలువైనా పొదుపు మంత్రం పాటించకపోతే జీవితాలు తారుమారవుతాయి. చాలా మంది ఆర్థిక క్రమశిక్షణ లేక జీవితాలను ఛిన్నాభిన్నం చేసుకుంటున్నారు. ఓ దశలో ప్రాణాలు కోల్పోవల్సిన ప్రమాదకర పరిస్థితులు ఎదురవుతాయి. అందుకే పొదుపు సూత్రాన్ని పాటించాలని నిపుణులు చెబుతున్నారు. ఆర్థిక కష్టాల నుంచి బయటపడే మార్గం సుగమం చేసుకోవాలని సూచిస్తున్నారు.

ఇవి పాటించాలంటున్న నిపుణులు..!!

- ప్రతీ కుటుంబంలో ఒక ఆర్థిక నిధి తప్పనిసరి. అనుకోని కష్టాలు వచ్చినప్పుడు ఆదుకుంటుంది. ఒకే వ్యక్తి పలు పథకాల కింద రుణాలు పొందటం కుటుంబానికి చాలా భారంగా మారే ప్రమాదం ఉంది. ఇటువంటి అన్ని అంశాలపై అవగాహన అవసరం.
- అనేక బ్యాంకులు క్రెడిట్ కార్డుల్ని ఇస్తున్నాయి. అత్యవసరం అనుకుంటేనే వాటిని వినియోగించాలి. అనవసరం ఖర్చులతో అప్పులపాలవ్వొద్దు.
- స్వల్ప సమయానికి భారీగా వడ్డీ ఇస్తామంటూ చాలా సంస్థలు బురిడీ కొట్టించే ప్రయత్నం చేస్తుంటాయి. వాటి వలలో పడొద్దు.
- చిన్న ఉద్యోగులు, మధ్యతరగతి వారు తప్పకుండా ఆరోగ్యబీమా తీసుకోవాలి. పలు సంస్థలు తమ ఉద్యోగులకు నామమాత్రపు మొత్తాలతో ఈ సౌకర్యాన్ని అందిస్తున్నాయి. ఉద్యోగుల వ్యక్తిగత బీమా సౌకర్యం తప్పనిసరి. రోడ్డుపైన జరిగే ప్రమాదాల్లో ప్రమాదం ఏర్పడితే దానికి బీమా పొందే వీలుంది.

నిరంతర పర్యవేక్షణ ఉండాలి

-జీసీ కవిత, కౌన్సెలింగ్ సైకాలజిస్టు

వ్యక్తి ఏ స్థాయిలో ఉన్నా తమ ఆదాయ వ్యయాలు ఆర్థిక లావాదేవీల్నీ నిత్యం పర్యవేక్షించుకోవాలి. ఏఏ రంగాల్లో పెట్టుబడుల్ని పెట్టారు? ఎంత మొత్తంలో లబ్ధి చేకూరింది? ఆ పెట్టుబడుల్నీ మళ్లీ దేనిమీద పెట్టడానికి సిద్ధం అవుతున్నారు? నష్టాలొచ్చే రంగంపైపు చూడకుండా లాభాల వైపు స్థిరాస్తుల్ని పెంచుకునే విధంగా సమగ్రమైన ప్రణాళికలు ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉంది. అయితే ఏవైనా అనుకోని ఆర్థికపరమైన సమస్యలు ఎదురైతే పరిష్కారం కోసం ప్రయత్నించాలి. ఆత్మహత్యల జోలికి వెళ్లకూడదు. ధైర్యంగా నిలబడి ఎదుర్కోవాలి. చావు దేనికి పరిష్కారం కాదనే విషయం గుర్తుంచుకోవాలి.

నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో మాజీ ఎమ్మెల్సీ శ్రీ మహ్మద్ సలీం, ముస్లిం సోదరుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్న మాజీ మంత్రి మహమూద్ అలీ ఎమ్మెల్యే ముఠా గోపాల్ తదితరులు

పరిపాలన భవనం ఎదుట ధర్నా చేపట్టిన బీఆర్ఎస్వీ నాయకులు

దివ్యాంగ పరిశోధక విద్యార్థుల అరెస్టు

బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో నిరసన

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీలో దివ్యాంగ పరిశోధక విద్యార్థుల అరెస్టును నిరసిస్తూ బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో విద్యార్థులు పరిపాలన భవనం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించాలని ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న దివ్యాంగ పరిశోధక విద్యార్థులను అక్రమంగా అరెస్టు చేయడంపై మండిపడ్డారు. మెస్ బిల్లుల అక్రమ వసూళ్లను నిరసిస్తూ ఓయూ పరిపాలన భవనంలో దివ్యాంగ పరిశోధక విద్యార్థులు పరిపాలన భవనంలోని వీసీ ఛాంబర్‌లో గురువారం ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. దీక్షలో కూర్చున్న వారిలో ఒకరు స్పృహ తప్పి పడిపోయినప్పటికీ అధికారులు పట్టించుకోలేదని మండిపడ్డారు. శుక్రవారం పోలీసులను పిలిపించి దివ్యాంగులనే కనీస కనికరం లేకుండా బలవంతంగా అరెస్టు చేయించారని దుయ్య బట్టారు. దీనిపై తక్షణమే ప్రభుత్వం స్పందించి వర్సిటీ అధికారుల నుంచి వివరణ కోరాలని డిమాండ్ చేశారు. శాంతియుతంగా ధర్నా చేస్తున్న విద్యార్థినే తలను పోలీ సులు బలవంతంగా అదుపులోకి తీసుకొని అంబర్‌పేట్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

నిజాం కళాశాలకు న్యాక్ ఏ గ్రేడ్

సుల్తాన్ బజార్, మార్చి 7 138 ఏళ్ల చరిత్ర కలిగిన నిజాం కళాశాలకు న్యాక్ ఏ గ్రేడ్ వరించింది. ఈ మేరకు శుక్రవారం యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ మెయిల్ ద్వారా కళాశాలకు ఏ గ్రేడ్ ను ప్రకటించింది. దీంతో కళాశాలలో ప్రిన్సిపాల్ తోపాటు బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రాజశేఖర్ మాట్లాడుతూ కళాశాలలోని బోధన బోధనేతర సిబ్బంది సమిష్టి కృషితోనే కళాశాలకు న్యాక్ ఏ గ్రేడ్ వచ్చిందని అన్నారు. ఈ సందర్భంగా ఉస్మానియా యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కుమార్ ను ఆయన ఛాంబర్లో నిజాం కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఏవి రాజశేఖర్ కలిసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిజాం కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్ రేణుక, హాస్టల్స్ వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అబ్కా నాగేశ్వరరావు, డాక్టర్ రాధిక తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఐక్యతే విజయానికి సోపానం

పిల్లలకు క్రమశిక్షణ,చదువు సంస్కారం నేర్పాలి

మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

సిటీబ్యూరో, మార్చి 7 (నమస్తే తెలంగాణ) మహిళలకు మహిళలే స్నేహితులని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి, కమిషనర్ ఇలంబర్తి, ఇతర మహిళా ఉన్నతాధికారులతో కలిసి మేయర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ వివిధ రంగాల్లో విజయాలు సాధించి ఉన్నతంగా రాణించిన మహిళా మణులను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు వెళ్లాలని సూచించారు. ప్రతి ఇంటిలో తల్లులు తన పిల్లలకు క్రమశిక్షణ నేర్పాలని, చదువు సంస్కారంతో పాటు సమాజంలో ఏ విధంగా నడుచుకోవాలో నేర్పాలని సూచించారు. మహిళలు ఐక్యంగా ఉన్నప్పుడే ఏదైనా సాధించగలమని డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి అన్నారు. కమిషనర్ ఇలంబర్తి మాట్లాడుతూ సమాజంలో మహిళలు కీలక ప్రాత పోషిస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా సర్కిళ్లలో ఉత్తమ సేవలు అందించిన మహిళా శానిటరీ వర్కర్లను మేయర్, డిప్యూటీ మేయర్, కమిషనర్ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు పంకజ, సుభద్రాదేవి, అలివేలు మంగతాయారు, సరోజ, గీతా రాధిక, జాయింట్ కమిషనర్ ఉమాప్రకాష్, సిఎంహెచ్ఓ డా.పద్మజ, డీసీ ప్రశాంతి మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

మహిళా దినోత్సవం

సిటీ బ్యూరో, మార్చి 7, (నమస్తే తెలంగాణ): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని సైబరాబాద్ కమిషనరేట్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా క్యూఐఎఫ్‌పీ అధికారి రమేశ్ బోయ, మనోవిజ్ఞాన శాస్త్రనిపుణురాలు లావణ్య, సీఏ అనురాగ్ పర్వతనేని హాజరై తమ సందేశాన్ని అందించారు. సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాశ్ మోహంతి కమిషనరేట్ పరిధిలో పని చేస్తున్న మహిళా సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు.

విలేకరులతో మాట్లాడుతున్న రామకృష్ణ

పరీక్ష ఫీజు గడువు పెంచాలి

రవీంద్రభారతి, మార్చి7: రాష్ట్రంలోని డిగ్రీ విద్యార్థులకు ప్రభుత్వం సకాలంలో స్కాలర్‌షిప్‌లు, ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో కాలేజీ యాజమాన్యాలు ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించలేదని పరీక్షా ఫీజు రుసుమును తీసుకోకుండా నిరాకరించారని, దీంతో డిగ్రీ విద్యార్థులు పరీక్షలు రాయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి,డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కుట్రలు చేస్తున్నారని బీసీ సంక్షేమం విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ తీవ్రస్థాయిలో ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. ప్రభుత్వ నిర్వాకం వల్ల విద్యార్థులను పరీక్షలు రాయకుండా కాలేజీ యాజమాన్యాలు నిరాకరించడంతో వారి జీవితాలు నాశనమవుతున్నాయని అన్నారు. దీంతో పరీక్ష ఫీజు తేదీని పొడిగించాలని వేముల రామకృష్ణ ప్రభుత్వానికి, యూనివర్సిటీ అధికారులను డిమాండ్ చేశారు.

మోదీ రాజ్యంలో మాట్లాడడం నేరమైపోయింది

చిక్కడపల్లి, మార్చి7: కేంద్రంలో అధికారంలో ఉన్న నరేంద్ర మోడీ రాజ్యంలో మాట్లాడడం, రాయడం నేరమైపోయిందని ముంబాయి హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బిజీ కొల్సే పాటిల్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కమిటీ ఫర్ ద డిఫరెన్స్ అండ్ రిలీజ్ ఆఫ్ డాక్టర్ సాయిబాబా నిర్వహణలో ''హీ హు డిఫైడ్ డెత్'' పుస్తకావిష్కరణ డాక్టర్ సాయిబాబా సంస్మరణ సభ జరిగింది. విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బిజీ కొల్సే పాటిల్ మాట్లాడుతూ ఆర్టికల్ 19 ప్రమాదంలో పడిపోయిందని, అయినప్పటికీ ప్రొఫెసర్ సాయిబాబా మాట్లాడినందుకే ఆయనను వ్యవస్థలే హత్య చేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. మోడీ తనపై ఉద్యమకారులు హత్యకుట్ర చేశారని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. ప్రొఫెసర్ హరగోపాల్, పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, వీక్షణం ఎడిటర్ ఎన్.వేణుగోపాల్, సామాజిక కార్యకర్త సజయ, రవిచంద్ర పాల్గొన్నారు.

దివ్యాంగులు, వృద్ధులకు ఉపకరణాల క్యాంపు

సిటీ బ్యూరో, మార్చి 7 (నమస్తే తెలంగాణ): కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా ఆలింకో, ఎస్‌బీఐ ఆధ్వర్యంలో దివ్యాంగులు, వయోవృద్ధులకు సహాయ ఉపకరణాలు అందించనున్నట్లు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 10న అంబర్‌పేటలోని గాంధీ బొమ్మ వద్ద మున్సిపల్ మైదానం, 11న సికింద్రాబాద్‌లోని గాంధీ దవాఖాన ఎదురుగా ఉన్న ఎవర్ గ్రీన్ కమ్యూనిటీ హాల్,12న ఖైరతాబాద్‌లోని ప్రేమ్‌నగర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భవన్, జీహెచ్ఎంసీ కమ్యూనిటీ హాల్,13న సీతాఫల్‌మండిలోని నామాలగుండు వద్దగల మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్‌లో అర్హులైన దివ్యాంగులు, వృద్ధులకు ఉపరకరణాలు అందజేస్తారని అన్నారు. క్యాంపునకు హాజరయ్యే వారు దివ్యాంగుల ధ్రువ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం లేదా రేషన్ కార్డు లేదా ప్రజా ప్రతినిధుల ద్వారా పొందిన ధ్రువపత్రం, ఆధార్ కార్డు, యూడీఐడీ కార్డు, యూడీఐడీ కార్డు లేనివారు నమోదు చేసిన నంబర్‌ను తీసుకుని ఉదయం 10 గంటలకు హాజరు కావాలని సూచించారు.

రంజాన్ మాసం తొలి శుక్రవారం సందర్భంగా రాత్రివేళ షాపింగ్‌లతో కళ కళ లాడుతున్న చార్మినార్ వీధులు



ఇండస్ట్రియల్ ఎండీ విష్ణువర్ధన్ రెడ్డితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

సేవాలాల్ భవన నిర్మాణాన్ని వెంటనే ప్రారంభించాలి

రామంతపూర్ మార్చి7 : సేవాలాల్ భవన్ నిర్మాణంకోసం ఇండస్ట్రియల్ ఎండీ విష్ణువర్ధన్ రెడ్డిని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కలిశారు. హబ్సిగూడ డివిజన్ పరిధిలోని వెలుగుగుట్ట వద్ద రూ.40 లక్షల నిధులతో మంజూరైన సేవాలాల్ భవనం నిర్మాణాన్ని వెంటనే ప్రారంభించాలని ఇండస్ట్రియల్ ఎండీ విష్ణువర్ధన్ రెడ్డిని ఆయన కార్యాలయంలో కలిసి మంజూరు పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పద్మ శ్రీ అవార్డు గ్రహీత కేతవత్ సొంలాల్ నాయక్, భూక్యా భీమా నాయక్, రాజునాయక్, రవినాయక్, కిషోర్ నాయక్, మాలునాయక్,. పడ్తియ నాయక్, వినోద్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నో సవాళ్ల తో హైదరాబాద్ మెట్రో నిర్మాణం

సిటీబ్యూరో, మార్చి 7(నమస్తే తెలంగాణ): ఎన్నో ఇంజనీరింగ్ సవాళ్లను అధిగమించి హైదరాబాద్ కేంద్రంగా ప్రపంచంలోనే తొలి పీపీపీ విధానంలో మెట్రో నిర్మాణం చేపట్టామని హెచ్ఎంఆర్ఎల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి అన్నారు. శుక్రవారం బాలానగర్‌లోని నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్‌లో 54వ జాతీయ భద్రతా వారోత్సవాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. మెట్రో స్టేషన్లలో అత్యున్నత ప్రమాణాలతో కూడిన భద్రత చర్యలు చేపట్టడంతో ఇప్పటివరకు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోలేదన్నారు. నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ డైరెక్టర్ ప్రకాష్ చౌహాన్, డిప్యూటీ డైరెక్టర్ పద్మావతి, సీనియర్ శాస్త్రవేత్తలు, అధికారులు పాల్గొన్నారు.



సమ్మర్ యాక్షన్ ప్లాన్ పనులను పరిశీలిస్తున్న ఎస్‌పీడీసీఎల్ సీఎండీ ఫరూఖి

సైబర్ సిటీలో సమ్మర్ యాక్షన్ పనులపై సమీక్ష

సిటీబ్యూరో, మార్చి 7 (నమస్తే తెలంగాణ): గ్రేటర్ హైదరాబాద్‌లో ఐటీ కేంద్రంగా ఉన్న సైబర్‌సిటీ సర్కిల్‌లో వేసవిలో ఏర్పడే అధిక విద్యుత్‌కు తగినట్లుగా విద్యుత్ సరఫరా అందించడానికి కావలసిన సమ్మర్ యాక్షన్ ప్లాన్ పనులను శుక్రవారం ఎస్ పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ పరిశీలించారు. ఈ సందర్భంగా పుప్పాలగూడ , ఎల్ అండ్ టీ, హఫీజ్‌పేట సబ్‌స్టేషన్‌లలో అదనంగా ఏర్పాటు చేసిన 12.5 ఎంవీఏ, 8ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను అధికారులు ఆవిష్కరించారు. డైరెక్టర్ ఆపరేషన్స్ డా.ఎన్ నర్సింహులు, సైబర్‌సిటీ ఎస్ఈ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గాలి ద్వారా సోకే ఎలర్జీలకు చెక్..

హైదరాబాద్ కొనసాగనున్న విస్తృత పరిశోధనలు

అతి పెద్ద పరిశోధన కేంద్రంగా హైదరాబాద్ ఎలర్జీన్ ఫోరెన్సిక్ ల్యాబ్

సెంటూరియన్ యూనివర్సిటీతో కీలక ఒప్పందం

హైదరాబాద్, మార్చి 7 (నమస్తే తెలంగాణ) : గాలి ద్వారా మనుషులకు సోకే రకరకాల ఎలర్జీలకు ఇక నుంచి చెక్ పడనుంది. అందుకు సంబంధించి పరిశోధనలు హైదరాబాద్ కేంద్రంగా ప్రారంభం కానున్నాయి. ఇందుకు సంబంధించి గత 20 సంవత్సరాలుగా కొనసాగుతున్న ప్రయత్నాలు ఇప్పుడు ఫలించాయి. ఈ మేరకు హైదరాబాద్ వరల్డ్ ఎలర్జీ ఫౌండేషన్, సెంటూరియన్ యూనివర్సిటీల మధ్య ఒక కీలక ఒప్పందం జరిగింది. ఈ ఒప్పంద పత్రాలపై శుక్రవారం ఉదయం రెడ్ హిల్స్‌లోని ఎఫ్‌టీసీసీఐ భవనంలో ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో ఈ రెండు విద్యా సంస్థలకు చెందిన ప్రతినిధులు సంతకాలు చేశారు. భారతదేశ ఏరోబయాలజీ పితామహుడు డా శ్రీపాద్ అగాశే శిష్యుడు డా వ్యాకరణం నాగేశ్వర్, వరల్డ్ ఎలర్జీ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడిగా దీని రూపకల్పనలో కీలక పాత్ర పోషించారు. దీర్ఘకాలిక శాస్త్రీయ చర్చల అనంతరం, ఈ గొప్ప విజన్‌ను వాస్తవ రూపం దాల్చాలని నిర్ణయం తీసుకున్నారు.

అలర్జెన్ ఫోరెన్సిక్ ల్యాబొరేటరీ ప్రారంభానికి సంబంధించిన ఎంఓయూ వివరాలను ప్రకటిస్తున్న వైద్యులు

ఇది 20 ఏళ్ల నాటి కల: డా వ్యాకరణం నాగేశ్వర్

ఈ విప్లవాత్మక ఆలోచనను కార్యరూపం దాల్చేందుకు గత 20 సంవత్సరాలుగా కృషి చేశారు. శాస్త్రీయ సాహిత్యంలో ఈ తరహా పరిశోధనల ప్రాముఖ్యత ఎన్నోసార్లు ప్రస్తావించబడినప్పటికీ, ఇది ఇప్పటివరకు వాస్తవ జీవితంలో అమలుకు నోచుకోలేదు. హైదరాబాద్, ఈ ఎలర్జీ, ఫోరెన్సిక్ పరిశోధన విప్లవానికి కేంద్ర బిందువుగా మారడం, ఆరోగ్య సంరక్షణ, న్యాయవిధానంతో పాటు విద్యా రంగాల్లో ఒక గొప్ప పురోగతిగా చెప్పకోవచ్చు. బహుళ శాస్త్రీయ అనుసంధానం ద్వారా ఎలర్జీన్ ఫోరెన్సిక్ ల్యాబొరేటరీస్ భారతదేశం శాస్త్రీయ నిపుణతను ప్రపంచ స్థాయికి తీసుకెళ్తుంది.

తొలి ఎలర్జీన్ ఫోరెన్సిక్ ల్యాబొరేటరీస్..

ఒక వినూత్న వైద్య, ఫోరెన్సిక్ పరిశోధన కేంద్రానికి సాక్ష్యంగా హైదరాబాద్ ఎలర్జీన్ ఫోరెన్సిక్ ల్యాబొరేటరీస్ నిలిచింది. డా వ్యాకరణం నాగేశ్వర్ నేతృత్వంలో, ఎలర్జీ సూపర్ స్పెషలిస్టులు, ఫోరెన్సిక్ శాస్త్రవేత్తలు, వృక్షశాస్త్ర నిపుణుల సమష్టిగా ఈ పరిశోధనలో భాగస్వామ్య వుతున్నారు. అయితే ఇప్పుడు తొలిసారిగా, ఎలర్జీ, ఫోరెన్సిక్ సైన్స్, వృక్ష శాస్త్ర నిపుణులు కలసి గాలి ద్వారా వ్యాపించే ఎలర్జీలను వాటి న్యాయ వైద్య విభాగంలో ప్రాముఖ్యతపై సమగ్రంగా అధ్యయనం చేయనున్నారు.

పరిశోధన లక్ష్యాలు..

వివిధ ప్రాంతాల్లో గాలి ద్వారా వ్యాపించే పుప్పొడి కణాలు, శిలీంద్ర స్పోరులు, అచ్చులు గల పరిసరాలను విశ్లేషించడం. అంతరంగిక (ఇండోర్), బహిరంగ (అవుట్ డోర్) పరిసరాలు, నేరస్థలాలు, వాహన భాగాలు, దుస్తులు, వ్యక్తిగత వస్తువులు మొదలైన వాటి నుండి నమూనాలను సేకరించడం.

అధునాతన సూక్ష్మదర్శిని పరికరాల ద్వారా ఎలర్జీన్ల రకం, జాతి, సాంద్రత అంచనా వేయడం.

ఎలర్జీ నిర్ధారణ , చికిత్సలో విప్లవాత్మక మార్పు ఈ పరిశోధన ఎలర్జీ రోగుల జీవితాలను పూర్తిగా మార్చివేస్తుంది. ప్రజలు తమ చుట్టూ ఉండే పుప్పొడి, అచ్చులతో పాటు శిలీంద్రాల గురించి ఖచ్చితమైన సమాచారం తెలుసుకో గలుగుతారు. ఈ డేటా ఆధారంగా, అత్యాధునికమైన చికిత్సగా పేరుగాంచిన ఎలర్జీన్-స్పెసిఫిక్ ఇమ్యూనోథెరపీ (ఏఎస్ఐటీ)ద్వారా ఎలర్జీ నివారణ సాధ్యమవుతుంది.దీని ద్వారా ఎలర్జీ బాధితుల జీవన నాణ్యత పెరుగడమే కాకుండా, మెరుగైన వైద్య పరిశోధనకు మార్గం సుగమం అవుతుంది.

ఫోరెన్సిక్ పరిశోధనలో కీలక పాత్ర

ఈ పరిశోధన.. నేర పరిశోధనలో కీలక పాత్ర పోషించనుంది. నేర స్థలాల్లో పుప్పొడి, శిలీంద్రాలు, అచ్చుల ఆనవాళ్లు విశ్లేషించడం ద్వారా నేరస్థుల కదలికలు, ప్రదేశాలు, కాలాన్ని గుర్తించవచ్చు. ఈ శాస్త్రీయ సాక్ష్యాలు, న్యాయ అమలు సంస్థలకు నేరాలను ఛేదించడంలో ఆయుధంగా ఉపయోగపడతాయి.

బీసీల రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలి

కాచిగూడ, మార్చి 7 : రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు పెంచిన 42 శాతం రిజర్వేషన్లకు అసెంబ్లీలో ప్రవేశ పెట్టి ఆమోదించి, కేంద్రానికి పంపించాలని రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. రాష్ట్ర బీసీ మహిళా సంఘం ప్రధాన కార్యదర్శి శ్రావణి ఆధ్వర్యంలో కాచిగూడ అభినందన హోటల్‌లో బీసీ సంఘాలతో సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆర్.కృష్ణయ్య హాజరై మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్తులను అమ్మ రాదన్నారు. రాష్ట్ర బీసీ మహిళ సంఘం ప్రధాన కార్యదర్శిగా ఎల్.శ్రావణిని నియమిస్తూ నియమక పత్రాన్ని అందజేశారు. బీసీలకు 42 శాతం పెంచిన రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో నీలవెంకటేష్, జనార్దన్, సుధాకర్, నందగోపాల్, రామకృష్ణ, శ్రీకాంత్ గౌడ్, జయంతి గౌడ్, అనంతయ్య, విజయ్, ప్రణీత, సునీత, రాజేందర్, పృథ్వీ హరీష్, రాజ్ కుమార్, వేణు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య